ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 25, క్యారెట్ 23, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 19, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 27, చామగడ్డ 40, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



ఉర్సులో పాల్గొన్న సదా కేశవరెడ్డి

రసూల్‌పురా: రసూల్‌పురా హాకీ స్టేడియం సమీపంలోని హజ్రత్ సయ్యద్ పీర్ అలీషా ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అఫ్రోజ్ నజీర్, సజ్జాదా నషీన్, జబ్బార్, అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

విభజన..తర్జనభర్జన

- సికింద్రాబాద్ కార్పొరేషన్‌పై ఆశలు
- అధ్యయన కమిటీ వేసిన సీఎం
- లష్కర్ అంతా ఇదే చర్చ



సికింద్రాబాద్: హెచ్‌ఎండీఏ పరిధిలోని ఏడు కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలను విలీనం చేస్తూ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని.. వీలుకాని పక్షంలో గ్రేటర్ నగరాన్ని నాలుగు సమాన భాగాలు చేసి నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి మున్సిపల్ ఉన్నత అధికారులతో అధ్యయన కమిటీ వేశారు. సీఎం చేసిన ఈ ప్రకటనతో సికింద్రాబాద్ ప్రాంత ప్రజల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. గ్రేటర్ నగరాన్ని నాలుగు కార్పొరేషన్లుగా విభజించాల్సిన పరిస్థితి వస్తే గ్రేటర్ నార్త్ కార్పొరేషన్‌గా సికింద్రాబాద్ ఏర్పాటయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ మార్గాల్లో సికింద్రాబాద్ ప్రాంతం నుంచి పెద్దమొత్తంలో ఆదాయం లభిస్తున్నా అభివృద్ధి విషయంలో మాత్రం ఈ ప్రాంతం వెనుకబడే ఉందని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక పరిపుష్టి కలిగిన కార్పొరేషన్‌గా ఉన్న సికింద్రాబాద్ ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. తిరిగి ప్రత్యేక కార్పొరేషన్‌గా ఆవిర్భవిస్తే ఈ ప్రాంతం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందన్న ఆశాభావాన్ని లష్కర్ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ఆవిర్భావం, విలీనం..

హైదరాబాద్ స్టేట్‌లో 1945లో సికింద్రాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటైంది. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల విలీనంతో 1950లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఆవిర్భవించింది. ఐదేళ్ల పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్లుగా ఉండేవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 1955లో రెండు నగరాల కార్పొరేషన్లను విలీనం చేస్తూ ఎంసీహెచ్‌ను ఏర్పాటు చేశారు. క్రమేణా గ్రేటర్ హైదరాబాద్‌గా ఆవిర్భవించింది. హైదరాబాద్ కంటే సికింద్రాబాద్ నుంచే జీహెచ్‌ఎంసీకి పెద్దమొత్తంలో ఆదాయం సమకూరుతుంది. అయినప్పటికీ ఈ ప్రాంతం సమస్యలకు నిలయంగానే ఉంది. ఇక్కడి నుంచి ఆదాయం రాబట్టడం తప్ప లష్కర్ అభివద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం లభించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అమలుకాని షరతులు..

సికింద్రాబాద్ కార్పొరేషన్‌ను హైదరాబాద్‌లో విలీనం చేసిన సందర్భంలో రెండు నగరాల అధికారులు, పెద్దల మధ్య పలు షరతులు విధించుకున్నారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే ఆదాయాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించడం మొదటిది. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు రెండింటిని ఒకే నగరానికి ఇవ్వకూడదన్నది రెండవది. విలీనం అనంతరం ఈ రెండు షరతులు అమలు చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి.

- సికింద్రాబాద్ నగరం ఆవిర్భవించి 200 సంవత్సరాలు పూర్తిచేసుకున్న దరిమిలా దివంగత సీఎం డా.వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ద్విశతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించింది. అదే సమయంలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం రూ.200 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినా ఆ తరువాత బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రులు అభివృద్ధి, ప్యాకేజీని విస్మరించారు.

సర్వత్రా హర్షం..

గ్రేటర్ కార్పొరేషన్ విభజన ద్వారా అన్ని ప్రాంతాల ప్రజలకు న్యాయం జరుగుతుందని లష్కర్ ప్రజలు భావిస్తున్నారు. హెచ్‌ఎండీఏ ప్రాంత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు విలీనం చేస్తూ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే అవకాశం లేదంటున్నారు. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యం అవుతున్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. నాలుగుగా కార్పొరేషన్ల విభజన జరిగితే ఉత్తర కార్పొరేషన్‌తో మళ్లీ సికింద్రాబాద్ కార్పొరేషన్ ఆవిర్భావం జరిగినట్టు అవుతుందంటున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో సికింద్రాబాద్‌కు అన్యాయం జరిగిపోయిందని, కార్పొరేషన్ల విభజన ద్వారా అయినా ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని సికింద్రాబాద్ ప్రజలు కోరుతున్నారు.

వంజరి కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ బీసీ కులాలను ఆదుకోవడానికి కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ వంజరి సేవా సంఘం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు శంకర నారాయణ, ప్రధాన కార్యదర్శి ధర్మరాజు, అఖిల భారత వంజరి సేవా సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సాల్వేరు కృష్ణ వంజరి, ఉద్యోగుల సంఘం నాయకుడు కాలేరు సురేష్ మాట్లాడుతూ.. గత 77 ఏళ్ల నుంచి ఏ ప్రభుత్వాలు వంజరులను పట్టించుకోలేదన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం వంజరులు సంచార వ్యాపారులు, బిడారు వర్తకులుగా పేరుగాంచారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు అణిచివేతకు గురవుతూనే ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం చొరవ చూపి వంజరి కుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి శాసన మండలి సభ్యులుగా వంజరులకు అవకాశం కల్పించాలన్నారు. బీసీలకు వారి పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలన్నారు. వారి కుల వృత్తులకు సాంకేతికను జోడించాలనే ఉద్దేశంతో కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమన్నారు.

లిఫ్ట్ ఆగింది.. కలకలం రేపింది



లిఫ్ట్ నుంచి మహిళలను బయటకు రప్పిస్తున్న సిబ్బంది

సికింద్రాబాద్: సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బుధవారం లిఫ్ట్ మధ్యలో ఆగిపోయి కలకలం రేపింది. సకాలంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది స్పందించి లిఫ్ట్‌లో ఉన్నవారిని బయటకు రప్పించడంతో ప్రమాదం తప్పింది. ఐదుగురు మహిళలు, ఇద్దరు యువకులు జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయ భవనపై అంతస్తులకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. రెండవ అంతస్తు చేరుకుంటున్న క్రమంలోనే ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో లోపల ఉన్న ఏడుగురు కేకలు వేయడంతో జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. లిఫ్ట్ ఆపరేటర్లు ముగ్గురికి బదులు ఒక్కరే అందుబాటులో ఉన్నప్పటికీ ఇతరుల సహాయంతో లిఫ్ట్‌లో ఇరుక్కున్న వారందరికీ క్షేమంగా బయటకు రప్పించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

'వేం'ను కలిసిన టీ-జాక్ నేతలు



వేం నరేందర్‌రెడ్డికి బయోడేటాను అందజేస్తున్న శ్రీరామ్ శివకుమార్

లాలాపేట: తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు బుధవారం సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో టీ–జాక్ పాత్ర, ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి చేసిన కృషిని ఆయనకు వివరించారు. త్వరలో చేపట్టబోయే నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరుతూ తమ బయో డేటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ. ఇటికాల పురుషోత్తమ్, ఓయూ కామర్స్ డిపార్టుమెంట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ పాల్గొన్నారు.

ఉస్మానియా ఫౌండేషన్ భవన్‌ను అడ్డుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిర్మించనున్న ఉస్మానియా ఫౌండేషన్ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటామని ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య బుధవారం పేర్కొన్నారు. విదేశాలలోని పూర్వవిద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూ.150 కోట్ల విలువ చేసే 1.20 (ఎకరం ఇరవై గుంటలు) ఓయూ భూమిలో భవనం నిర్మించడం దారుణమన్నారు. ఏడాదిలో ఎప్పుడో ఒక్కసారి వచ్చే విదేశీ పూర్వ విద్యార్థుల కోసం నగరం నడిబొడ్డున గల కోట్ల విలువ చేసే ఓయూ స్థలాన్ని కేటాయించడం తగదన్నారు. గతంలో రూ.20 కోట్లతో అలూమ్ని భవనం నిర్మాణానికి యత్నించగా విద్యార్థులు అడ్డుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఉస్మానియా ఫౌండేషన్ ద్వారా లభించే విరాళాల నుంచి నిధులను ప్రస్తుతం చదివే పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు.

సీఎం చొరవతో కంటోన్మెంట్‌లో అభివృద్ధి



రోడ్డు పనులపై కాలనీవాసులతో చర్చిస్తున్న వెన్నెల

రసూల్‌పురా: గత 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు సీఎం రేవంత్ రెడ్డి చొరవతో త్వరలో రూ. 86 లక్షలతో చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ జీవీ. వెన్నెల తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఆశా ఆఫీసర్స్ కాలనీలో పరిసర కాలనీవాసులతో గురువారం ఆమె కాలనీలో పర్యటిస్తూ మాట్లాడారు. అమ్ముగూడ రైల్వే స్టేషన్ నుంచి ఆర్‌కేపురం ప్రధాన రోడ్డు వరకు రోడ్డు అధ్వాన స్థితికి చేరిందని ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నిధులు విడుదల చేసి రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారన్నారు. త్వరలో బొల్లారంలోని కంటోన్మెంట్ జనరల్ హాస్పిటల్ అత్యాధునిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యా దీవెన పథకం కింద పది ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జైప్రకాష్, మర్రి అమరేందర్ రెడ్డి, మనోజ్, తేజ్‌పాల్, రమణ, విఠల్, శ్రీధర్, శాంతమూర్తి, లయన్ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

గాంధీఆస్పత్రి : నీటికాసుల వ్యాధిగా పిలవబడే గ్లకోమా రుగ్మతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. ప్రపంచ గ్లకోమా నివారణ వారోత్సవాల్లో భాగంగా గాంధీ ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పలు అవగాహన కార్యక్రమాలు, చైతన్యర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రాజారావు, ఆప్తమాలజీ హెచ్‌ఓడీ రవిశేఖర్‌రావు మాట్లాడుతూ..గ్లకోమా అనేది ఒక రకమైన కంటి వ్యాధి, ఏ వయసు వారికైన రావచ్చు.. 60 ఏళ్లు పైబడిన వారిలో గ్లకోమాతో అంధత్వం వచ్చే అవకాశాలు ఎక్కువని స్పష్టం చేశారు. తలనొప్పి, కంటినొప్పి, వాంతులు, వికారం, దృష్టి మందగించడం, కంటి చికాకు తదితర లక్షణాలు ఉంటే గ్లకోమాగా భావించాలన్నారు. స్వీయరక్షణ, జీవనశైలిలో మార్పులతో గ్లకోమా వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. గ్లకోమా నివారణ, నియంత్రణకు గాంధీ ఆప్తమాలజీ విభాగంలో నిష్ణాతులైన వైద్యులు, అన్నిరకాల వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజీ, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీలు రవిశేఖర్‌రావు, సుబోధ్‌కుమార్, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, ఆప్తమాలజీ వైద్యులు ప్రావీణ్య, సృజనీ, సింధు, ప్రకాశ్, పాల్గొన్నారు.

తిరుమలగిరి చెరువుకు పూర్వవైభవం



పనులను ప్రారంభిస్తున్న బ్రిగేడియర్ సోమా శంకర్, మధుకర్ నాయక్

రసూల్‌పురా: తిరుమలగిరి చెరువును ఆధునికీకరించి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు కంటోన్మెంట్ బ్రిగేడియర్ సోమ శంకర్, సీఈవో మధుకర్‌నాయక్ తెలిపారు. హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ సీవరేజ్ బోర్డు రూ.5.90 కోట్ల వ్యయంతో చేపట్టే చెరువు అభివృద్ధి పనులను బుధవారం బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా బస్తీలు కాలనీల నుంచి వచ్చే మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న ఓపెన్‌నాలాకు అనుసంధానం చేస్తామన్నారు. అదే విధంగా సీవరేజీ ప్లాంట్ ఏర్పాటు చేసి శుద్ధి చేసిన మురుగునీటిని చెరువులోకి వ్యర్థాలను ఓపెన్ నాలాలోకి మళ్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఇంజినీరింగ్ అధికారులు గోపాల కృష్ణ దాస్, ఉమాశంకర్, ఫణికుమార్ రాజేశ్వర్, శానిటేషన్ విభాగం అధికారులు దేవేందర్, మహేందర్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌లో మాదిగలకు తీరని అన్యాయం'



వేల్పుకొండ వెంకటేష్

లాలాపేట: బీఆర్‌ఎస్ పార్టీలో మాదిగలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆ పార్టీ విద్యార్థి విభాగం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. వేల్పుకొండ వెంకటేష్ ఆరోపిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో 3 ఎస్సీ రిజర్వు స్థానాలు ఉన్నాయన్నారు. అందులలో ఎస్సీ రిజర్వు స్థానాలైన పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గం నుంచి మాల సామాజిక వర్గానికి చెందిన కొప్పుల ఈశ్వర్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మాదిగ ఉపకులానికి కడియం శ్రీహరి కూతురు కావ్యను ప్రకటించారని, అసలు కడియం కావ్య ఏ సామాజిక వర్గానికి చెందిందో తెలియడం లేదన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి అయినా మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలను విస్మరించడం తగదని దీనిపై పార్టీ అధినేత కేసీఆర్ పునరాలోచించాలని కోరారు.

17న మాచర్ల నియోజకవర్గవాసుల ఆత్మీయ సమావేశం



పినెల్లి వెంకటరామారెడ్డి

ముషీరాబాద్: ఉద్యోగ, వ్యాపార, ఇతర కారణాలతో హైదరాబాద్, సికింద్రాబాద్‌లో నివాసముంటున్న మాచర్ల నియోజకవర్గ వాసులతో మార్చి 17న ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఏపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పినెల్లి వెంకటరామారెడ్డి తెలిపారు. మియాపూర్‌లోని నరేస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే ఈ ఆత్మీయ సమావేశానికి మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ పినెల్లి రామకృష్ణారెడ్డి, నర్సారావుపేట పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని హైదరాబాద్‌లో నివసించే మాచర్ల నియోజకవర్గ వాసులందరూ హాజరవ్వాలన్నారు.



ఎస్‌ఎల్‌ఎఫ్ డబ్బులు వసూలు చేస్తున్నాడని ఫిర్యాదు



డ్వాక్రా మహిళల సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: డ్వాక్రా రుణాలు పొందాలంటే తనకు ఎంతో కొంత నగదు ముట్టజెప్పాలంటూ ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షుడు హుకుం జారీ చేస్తున్నారంటూ పలువురు డ్వాక్రా మహిళలు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సనత్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశంలో పలువురు మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్‌కు విన్నవించారు. ముఖ్యంగా తమకు వచ్చే రుణాల్లో కొంత కమీషన్ రూపంలో ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షుడు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. దీనికి కార్పొరేటర్ స్పందిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన డ్వాక్రా మహిళలు కాయాకష్టం చేసుకుని జీవించేవారని, అలాంటి మహిళల నుంచి నగదు వసూలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్ మానయ్యలకు సూచించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే పూర్తిగా అధికారులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలను బాల్‌రెడ్డి, పుష్పలత, రేణుక, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సీఏఏను ఉపసంహరించుకోవాలి: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఏఏను వ్యతిరేకించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లో వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని తెలంగాణలో అమలు చేయకుండా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ, లౌకిక విలువలకు తూట్లు పొడిచే విధంగా, మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్న మోదీ ప్రభుత్వం మరో ముందడుగు వేసి లోక్ సభ ఎన్నికలకు ముందు పౌరసత్వ (సవరణ) చట్టం–2019ను అమలు చేస్తున్నట్లు ప్రకటించడం అహేతుకమైన చర్య అని వారు అభివర్ణించారు. సీఏఏ చట్టం 'వివక్షత'తో కూడిందన్నారు. మత–విభజన చట్టాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని వారు తెలిపారు.

హుస్సేన్ సాగర్‌లో దూకి యువకుడు ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: పనికి వెళ్లడం లేదని సోదరుడు మందలించడంతో ఓ యువకుడు హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సెక్రటరియేట్ లేక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ గౌస్ (24) బట్టల దుకాణంలో పని చేసేవాడు. గత 10 రోజుల నుంచి పనికి వెళ్లకపోవడంతో సోదరుడు మందలించాడు. ఈ నెల 11న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన గౌస్ ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు అదే రోజు ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం ట్యాంక్‌బండ్‌పై గల చిల్డ్రన్స్ పార్కు వద్ద హుస్సేన్ సాగర్‌లో గుర్తు తెలియని యువకుడి మృతదేహం తేలియాడుతుందన్న సమాచారం అందుకున్న పోలీసులు వెలికితీశారు. అప్పటికే తప్పిపోయిన యువకుడి సమాచారం ఉండటంతో సెక్రటరియేట్ లేక్ పోలీసులు మృతుడిని కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వాళ్లు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

వినికిడి సమస్యలను అశ్రద్ధ చేయొద్దు



మాట్లాడుతున్న నైతిక్

సనత్‌నగర్: వినికిడి సమస్యల విషయంలో అశ్రద్ధ చేయవద్దని, వాటిని అధిగమించేందుకు ఆధునికంగా ఎన్నో ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయని ఆరా హియరింగ్ అండ్ స్పీచ్ కేర్ సీఈఓ నైతిక్ తెలిపారు. సిగ్నియా భాగస్వామ్యంతో పంజగుట్టలో ఆరా హియరింగ్ అండ్ స్పీచ్ కేర్‌ను ప్రారంభించిన సందర్భంగా బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆడియోమెట్రీ, టిమ్పానోమెట్రీ, వినికిడి సహాయ ట్రయల్, ఫిట్టింగ్, ప్రోగ్రామింగ్, సర్వీసింగ్ వంటి ప్రత్యేక సేవలతో పాటు అనేక రకాల ఉపకరణాలతో పాటు సమగ్రమైన ఆడియోలాజికల్ సేవలను అందించడం జరుగుతుందన్నారు. వినికిడి అనేది జీవితంలోని ఏ దశలోనైనా ఎవరినైనా ప్రభావితం చేయగలదన్నారు. భారతదేశ జనాభాలో దాదాపు ఆరు శాతం మంది వివిధ స్థాయిల్లో వినికిడి లోపంతో బాధపడుతున్నారని పరిశోధనలు సూచిస్తున్నాయన్నారు. సకాలంలో స్పందించకుంటే శారీరక, సామాజిక సవాళ్లకు దారి తీస్తుందన్నారు. ఆరాలో అర్హత కలిగిన ఆడియోలజిస్ట్‌లు వినికిడి లోపం, లక్షణాలు, కారణాలను పరిశోధించడంలో సహాయం చేస్తారన్నారు.

సంప్రదాయ పద్యకవి మధునాపంతుల



చిక్కడపల్లి: మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి సంప్రదాయ పద్యకవి అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. త్యాగరాయ గానసభలో బుధవారం శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా తెలుగు సాహిత్య నిర్మాత మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి సంస్మరణసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ... తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా అచ్చ తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న కవులలో ప్రముఖుడు మధునాపంతుల అన్నారు. ఆధునిక సంప్రదాయ పద్యకవులలో ప్రతిభ అభ్యాసం, ఉత్పత్తి సమపాళ్లలో సముపార్జించిన మహాకవి ఆయన అన్నారు. ఆయన రచించిన ఆంధ్రపురాణం కవ్యంలో విశ్వనాథవారి కవితాధార, కరుణశ్రీ వంటి కవుల శైలి లాలిత్యం కనిపిస్తాయన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, సంఘసేవకులు ఆత్మీయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్: పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తల్లి మంద కొమురమ్మ 9వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు మల్లికార్జున్, రఘువరన్, శ్రీనివాస్, వేణుగోపాల్, శివప్రసాద్, విజయ్, నర్సింగ్‌రావు, దశరథ్, దేవేందర్, బాబు పాల్గొన్నారు.